# వెన్నెల సాక్షిగా...

ఆకాశంనుండి వెన్నెల.....జలపాతంలా జారుతోంది.

డాబా అంతా....వెండిపూత పూసినట్లుంది.

మేఘాలు హడావుడిగా పరుగెడుతున్నాయి.

పాలరాతి బొమ్మలా వైదేహి వాలు కుర్చీలో కూర్చుంది. కన్నులు మూసుకుని.....కానీ.....మనసు కిటికీ తెరుచుకునే వుంది. నగర జీవితపు యాంత్రికత....బావ ఉదాసీనత....ఊహలకి వాస్తవానికి మధ్య అంతరం.....జ్ఞాపకం అలలు అలలుగా బయటకు వస్తున్నాయి. పండు వెన్నెల....నక్షత్రాలతో వినీలాకాశం......జీవన గమన్నాన్ని ఐదేళ్లు వెనక్కు తిప్పేశాయి. ఆ రోజులు.....ఇప్పటికీ నిత్యనూతనంగా....కళ్లకు కట్టినట్టు స్పష్టంగా గుర్తున్నాయి....

.............

డిగ్రీ ఆఖరు సంవత్సరం చదువుతున్న రోజులు. స్నేహితులు....చదువు....సినిమాలు.....జీవితం అందమైన కలల అలలపై నావలా తేలిపోతోంది. ఉన్న ఊళ్లో చదువు సరిగ్గా లేదని బావ మా ఊరొచ్చాడు. మా కాలేజీలోనే చేరాడు. మా ఇంట్లో ఉండమన్నా ఉండకుండా బయట గది తీసుకున్నాడు కానీ ఎప్పుడూ మా ఇంట్లోనే ఉండేవాడు.

బావతో స్నేహం మధురమైన భావనలా ఉండేది. మంచి భావకుడు. గోదావరి ఒడ్డున కూర్చొని అస్తమించే సూర్యుని చూసినా...తల్లి కాళ్లకు అడ్డుపడే లేగలను చూసినా....మైమరచిపోయేవాడు.....మరో లోకంలోకి వెళ్లిపోయేవాడు. మాట్లాడుతూంటే గుండె గొంతులో వినిపించేది. బావ గుండె లోతులోంచి వచ్చే ప్రతి మాటా ....నన్ను కూడా ప్రకృతిలో లీనమయ్యేలా చేసి....నాలోని అణువణువును పులకింపచేసేది. నాకు తెలీకుండా బావతో భావి జీవితం ఊహించుకుని వెన్నెల నౌకపై నక్షత్రలోకాన్ని స్పృశించి వచ్చేదాన్ని.

కాలం ఎవ్వరికోసం ఆగలేదు. రోజులు వారాలుగా వారాలు నెలలుగా రూపాంతరం చెంది సంవత్సరం ఆఖరుకు వచ్చింది. పరీక్షలు అయిపోయాయి. రేపే బావ ప్రయాణం. ఆ ఊహే నాకు భరింపరానిదిగా ఉంది. ఇన్నాళ్లూ నేను, బావ తిరిగిన ప్రదేశాలు, పంచుకున్న అనుభూతులు. రేపటి నా



ఒంటరితనాన్ని తలవుకు తెచ్చి భయపెడుతున్నాయి. డాబా మీద ఒంటరిగా కూర్చున్నాను. వెన్నెల మండిపోతోంది. నక్షత్రాలు బిక్కుబిక్కుమంటున్నాయి. రేపటి నా మనసుకి అద్దం పట్టినట్టు ప్రకృతి స్తబ్దంగా, నిర్వేదంగా ఉంది. వెనకనుండి అడుగుల చప్పుడు క్రమంగా..... దగ్గరగా.....నా వెనకగా ఆగాయి. నెత్తి మీద చల్లని హస్త స్పర్శ. ఆపటం నా వల్లకాలేదు. కట్టలు తెగి గోదావరిలా..శ్రావణ మేఘంలా....జలజలా కన్నీళ్లు

"బావా......"అంటూ లేచి చుట్టుకుపోయాను. బావ మౌనంగా దగ్గరకు తీసుకున్నాడు. తల నిమురుతున్నాడు. ఏడ్చి ఏడ్చి అలసిపోయాను. తలపైకెత్తి బావ మొహంలోకి చూస్తే.....అదే చిరునవ్వు "బావా...."మాటలు రావడం లేదు. కన్నీళ్లు జారుతూనే వున్నాయి.

"వైదేహీ.....ఎన్నాళ్లని ఈ ఎడబాటు. రేపటి నుండే ఉద్యోగ ప్రయత్నం. ఉద్యోగం రావడం ఆలస్యం. మన ఊహలకి రూపకల్పన చేసుకుంటూ.....నువ్వూ......నేను శాశ్వతంగా అందమైన తోటలో...శృంగార మందారాలను స్పృశిస్తూ....ఆహ్లాదంగా సాగిపోదాం.

బావ మాటలు నా చెవులకు వేయి వీణలు మీటినట్టు వినిపించాయి. సిగ్గుతో ఆనందం....మాటలకందని అనుభూతి మరింతగా అల్లుకుపోయాను.

భారంగా మరో ఆరు నెలలు ముందుకు కదిలాయి. బావకి బ్యాంకులో ఉద్యోగం....మాపెళ్లి....త్వరత్వరగా జరిగిపోయాయి. రెండు ఏళ్లు భూప్రదక్షిణం చేస్తూ....ఆనంద సాగరాల అంచులను వెదుక్కుంటూ పయనించాం. బావకి ప్రమోషన్లు.....పని ఒత్తిడి.....క్యాంపులు....ఒంటరితనం. ఈ మధ్య మరీ ఎక్కువగా ఉంది. జీవితం నిస్సారం అయిపోతున్నట్లుంది.

వెనకనుండి అడుగుల సవ్వడి.....క్రమేపి దగ్గర అయింది.

"వైదేహీ...." పలక బుద్ధి కాలేదు.

"వైదేహీ....." బావ గొంతు మనసు మూలలను తట్టి లేపుతోంది.

జ్ఞాపకాలతో బరువెక్కిన హృదయం బావ పిలుపుకు కదిలి కళ్లల్లో కరిగిపోతోంది. "బావా..." అని మాత్రం అవగలిగింది ఆర్తితో.

"బావా.....నువ్వులేని ఈ వెన్నెల నన్ను వెక్కిరిస్తోంది బావా.......ఈ వాతావరణం....మనల్ని పరవశింపచేసిన ఈ ప్రకృతి....ఒంటరితనం.....నన్ను భయపెడుతున్నాయి." కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. చేతులలో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

పక్కన కూర్చొని తల నిమురుతూ...."వైదేహీ...ఈ మధ్య నాకూ...ఏదో వెలితి కనిపిస్తోంది జీవితంలో. పరుగులు. పోటీ.....యాంత్రికత....ఈ స్థితినుంచి బయట పడటానికి ఒక నిర్ణయం తీసుకున్నా వైదేహీ...ఇక నుండి వారంలో ఒక రోజు....మిగిలిన రోజులకి భిన్నంగా..ఆనందంగా...ఆహ్లాదంగా గడుపుదాం.....ఆసమయంలో.....మన ఇద్దరమే.....నా ఎదురుగా నువ్వు.....నీ ఎదురుగా నేను. అంతరాయంలేని మనం ఏకాంతంగా...." భావోద్రేకంలో చెప్తుకుపోతున్నాడు.

"చాలు బావా....ఈ జన్మకి ఈ వరం చాలు. ఒడిలో వాలిపోయింది వైదేహి.

వెన్నెల....జలపాతంలా జారుతూనే ఉంది. వైదేహి మాత్రం బావ ఒడిలో....."ఈ క్షణం ఇలా ఆగిపోతే ......" అనుకుని తృప్తిగా కన్నులు మూసుకుంది.

— తులసి జగన్నాథ శర్మ
హైదరాబాద్